# 28. పాలరాతి ప్రేమచిహ్నం

పంజాబ్‌లోని కపూర్తలా సంస్థానాధీశులైన మహారాజా జగత్‌జిత్ సింహజీవారు ఓసారి యూరప్‌లో విలాసయాత్రచేస్తు జీవితం మూడు సీసాలు ఆరుగసరు ముదితలూగా గడిపి వేస్తూ జెకోస్లోవేకియా రాజధాని ప్రాగ్‌లో ఓదివ్యమైన హోటల్లో విడిది చేసివుండగా ...

అనుకోకుండా ఓ సుందరాంగి శ్రీవారి కంట పడింది.

తొలి చూపులోనే ఆ పదారు, పద్దెనిమిదేళ్ళ నవయవ్వని తన హృదయాన్ని గాలానికి తగిలించుకొని ఎటో ఈడ్చుకు పోయిందని మహారాజా వారు ఆవిడ కనుమరుగైన మరుక్షణం గ్రహించేసేరు.

కనుక...!

ఆ పోయిన హృదయాన్నీ, ఆ హృదయానికి బిగుసుకున్న గాలాన్నీ, గాలాన్ని పట్టుకున్న ముద్దరాలినీ ఏకంగా తన పడక మీదికి ఈడ్చుకురావటం ఎలాగో ఆలోచించమని అంతరంగికులను ఆదేశించేరు.

సదరు బాలాకుమారి ఓ వెలుగు వెలిగి ఆరిపోయిన హంగేరియన్ ప్రభువు బిడ్డ. తల్లి జెక్ దేశస్తురాలు. ప్రస్తుతం వారంతా ప్రాగ్‌లోనే ఉంటూ తమతాతలు తాగిన నేతుల్ని నెమరు వేసుకుంటూ, తమ తండ్రులు త్రాగిన విస్కీల్ని గుర్తుకు తెచ్చుకొని నిషాతెచ్చుకుంటూ గత వైభవాల మసకచీకట్లలో ఏ వైభవంలేని బ్రతుకు వెళ్ళదీస్తున్న ప్రభువులు.

తత్కారణాన... మహారాజా జగత్‌జిత్ సింహజీవారి పనువున ఆ

యువతి పూర్వాపరాలు సేకరించనేగిన శ్రీవారి అంతరంగికులకు సమస్యా పరిష్కారం ఏమంత కష్టం కాలేదు.

వారు సరాసరి ఆమె తల్లి దండ్రుల వద్దకేగి మహారాజావారి సంస్థానం జెకోస్లోవేకియా కన్నా ఎన్నిరెట్లు పెద్దదో, శ్రీవారి గడ్డం — మీసాలు అనేకమంది యూరోపియన్ ప్రభువులవాటికన్నా ఎంతెంత పెద్దవో, శ్రీవారి ఖజానాలో మూలిగే వజ్ర వైఢూర్యాలు యూరప్‌లోని గనులన్నింటినీ గాలించినా ఎందుకు దొరకవో సవివరంగా వర్ణించి వారిని ఆదర గొట్టివేసేరు.

అప్పట్లో యూరప్‌లో భారతదేశపు మహారాజులంటే వాళ్ళు సాక్షాత్తు కుబేరుడి కొడుకులూ, దేవేంద్రుడి అన్నలూ అనే సదభిప్రాయం ఉండేది.

కనుక ...!

"సిరి రా మోకాలొడ్డిన..." పద్యంచదువుకున్న ఆ హంగేరియన్ ప్రభుదంపతులు తమముద్దుల బిడ్డ మహారాజా వారి సుపుత్రుడికి భార్య అవుతుందనీ, ఆ తర్వాత ఆవిడే మహారాణీ అవుతుందనీ రాజావారిబంట్లు చెప్పగా విని ఆనంద భరితులై అందుకు అంగీకరించేరు.

తమ కష్టాలు తీరిపోయేయని ఆనందించి అల్లుడి యొక్క, అల్లుడి గారి ఫాదరు యొక్క ఆతిథ్యం కొంతకాలం స్వీకరిద్దామని వారున్నూ తమ బిడ్డతోపాటు శ్రీవారి ఖర్చుమీద కపూర్తలా వేంచేసేరు.

వేంచేసి ... శ్రీవారి జగత్‌జిత్ ప్యాలస్‌లోని ఓ సుందర ప్రాంగణంలో తాత్కాలికంగా కాపురం పెట్టేరు.

మహారాజావారు వారికి సకలభోగాలూ రుచి చూపించేరు. వారు తమ తాతముత్తాతల నాటి రాచవైభవాల్ని సైతం మరిచిపోయేట్లు వార్ని సుఖపెట్టేరు.

ఈలోగా వారి ముద్దుల బిడ్డను తనఉంపుడు కత్తెల మందిరంలో గప్‌చిప్‌గా చేర్చివేసేరు.

అంతా పూర్తయ్యాక...

"అయ్యా! మీబిడ్డను నాకే ఇచ్చి ఎందుకు వివాహం చేయగూడదూ? ఎప్పుడో ఎందుకు, ఇప్పుడే మీఅమ్మాయి మహారాణీ అయిపోతుందిగదా?" అని కబురుచేసేరు.

పీకల దాకా సుఖాల మత్తులో మునిగి పోయున్న ఆ తల్లి దండ్రులున్నూ అందుకు మారుపలు కుండా అంగీకరించేసేరు.

మహారాజా వారున్నూ ఆవిడ పేరు తారాదేవిగా మార్పించి ఓ శుభ మూహూర్తాన గప్‌చిప్‌గానే అయినా వేదోక్తంగా వివాహమాడారు.

ఇంక చాటుమాటు ప్రణయంఅవసరం లేకపోవటంతో శ్రీవారు తన కూతురు సైజులో ఉన్న తారాదేవిని వెంటబెట్టుకొని ఓ సారి దేశంలోనూ, యూరప్‌లోనూ హనీమూన్ చేసి వచ్చారు.

వారలా అన్ని దేశాలూ తిరిగి, అన్ని సుఖాలూ ఆనుభవించి, స్వస్థలానికి చేరుకునే నాటికి...

కపూర్తలా సంస్థానోద్యోగ వర్గం లోనూ...

మహారాజావారి బంధువర్గంలోనూ...

అప్పటికే కలకలం రేగి ఉన్నది.

తారాదేవికీ, ఆమె తలిదండ్రులకూ వ్యతిరేకంగా కుట్రలుకూడా ప్రారంభం అయి ఉన్నాయి.

అంతవరకూ ఉన్న మహారాణుల్నికాదని ఈ విదేశీయురాలు మహారాణిగా ప్రతిష్ఠింప బడటం వారికి ఎంతమాత్రం నచ్చక పోవటం ఇందుకు కారణం.

ఫలితంగా విచిత్ర పరిస్థితుల్లో తారాదేవి అనుంగుతల్లి మరణిం చింది.

కానీ, ఏవర్నీ ఏమనేందుకూ సాక్ష్యాధారాలు లేవు. ఆమె తండ్రికి సీసాతోడిదే లోకం కనుక అతని కివేవీ పట్టవు. అతనెవరికీ అడ్డంకాడు.

ఈ అంతఃపుర కుట్రలతో తారాదేవి మానసికంగా అలసిపోయింది. దీనికి తోడు మహారాజా జగత్‌జిత్ సింహజీ వారు అక్షరాలా నిర్వీర్యు లయ్యేరు. అలాగని సాక్షాత్తూ అంతఃపురపు సెక్సు స్పెషలిస్టే సెల విచ్చేడు.

ఫలితంగా తారాదేవికి శ్రీవారితో శృంగారకలాపం కూడా భరించ రాని తలనొప్పిగా తయారయి పోయింది. మహారాజావారి పడక మీదికి చేరటానికే ఆవిడ నిరాకరించ సాగింది. మహారాజా వారు బలవంతాన చేరిస్తే మరుక్షణం ఆవిడకు మూర్ఛలు వస్తుండేవి.

ఇదేదీ నాటకం కాదని అంతఃపుర స్పెషలిస్టు గారున్నూ పరీక్షల అనంతరం సెలవిచ్చేరు.

అప్పుడు, ఆ తలనొప్పివెళ్లి మహారాజా జగత్‌జిత్ సింహజీ వారిని ఆశ్రయించింది.

అందుపై స్పెషలిస్టు గారి సలహా ప్రకారం మహారాజావారు గాలి మార్పు కోసం అని కొంతకాలం దేశాటనానికి పంపేరు. ఆవిడకు తోడుగా ఆవిడ సెక్సు వాంచల్ని తీర్చగల నవ యవ్వనుడూ, దృఢకాయుడూ, సుందరాంగుడూనైన ఓ యువ సైన్యాధికారిని కూడా అంగరక్షకునిగా తోడిచ్చి పంపేరు.

వారలా వెళ్ళి ఢిల్లీలోని ఖరీదైన మైడెన్‌హోటల్లో మరీ ఖరీదైన ఓ సూట్‌లో విడిది చేసేరు.

కానీ, మేజర్‌సింగ్ అనబడే సదరు సుందరాంగుడు ఎన్ని శృంగార సంకేతాలందించినా తారాదేవి చలించలేదు. సరిగదా ఆవిడ మతి మాత్రం మరింతగా చలించ నారంభించింది.

ఓ రోజున తారాదేవి ఎవరికీ తెలీకుండా టాక్సీ ఎక్కి కుతుబ్ మినార్ చూడనేగింది. మీనార్ చివరి అంతస్థుదాకా ఎక్కాం తరువాత...?

కనుమూసి తెరిచేలోగా ఆవిడ క్రిందికి దూకేసింది.

నలుగురూ జరిగిందేమిటో గ్రహించి చూసే సమయానికి రక్త సిక్తమైన ఆవిడ కళేబరం కుతుబ్‌మీనార్ రెండో అంతస్తు కమ్మీలకు వ్రేలాడుతోంది.

ఆ విధంగా మహారాజా జగత్‌జిత్ సింహజీవారి ప్రేమాయణానికి ఫుల్‌స్టాప్ పెట్టబడింది.

మరి శ్రీవారేం చేశారంటే తారాదేవి శవాన్ని ఢిల్లీలోనే సెంట్ జాన్స్ చర్చి తాలూకు శ్మశానంలో సమాధి చేయించి ఆ సమాధి మీద ఆవిడ స్మృతి చిహ్నంగా ఓ పాలరాతి పలకను అతికింపించేరు.

ఢిల్లీ వెళ్ళినపుడల్లా శ్రీవారా సమాధి మీద ఓ పుష్పగుచ్ఛాన్ని పాప పరిహారంగా పెడుతూండేవారు.

★